4వ పాఠం జనవరి 17-23

# సమాధానము కలుగజేయు ఆత్మ మరియు గర్వము లేని హృదయము

**సబ్బాతు మధ్యాహ్నము** **అక్టోబరు 17**

**ఈ వారమునకు చదువ వలసిన వచనములు : ఫిలిప్పీ 2:1-3; ఫిలిప్పీ 2:3,4; ఫిలిప్పి 2:5; ఫిలిప్పి 2:5-8; రోమా 8:3.**

**కంఠతవచనం : "మీరు ఏకమనస్కులగునట్లుగా ఏక ప్రేమ కలిగి, యేక భావము గలవారుగా ఉండి, ఒక్క దానియందే మనస్సుంచుచు నా సంతోషము సంపూర్ణము చేయుడి" (ఫిలిప్పీ 2:2).**

మనము ఐకమత్యముతో ఉన్నపుడు బలముగా ఉంటాము. ఒక సంఘముగా ఐకమత్యము కలిగి యుండాలని మనకు తెలుసు. తీవ్రముగానే ప్రయత్నిస్తాము. కొన్నిసార్లు సఫలమగుదుము. కొన్ని సందర్భాలలో విఫలము చెందవచ్చు. మీరు ఐక్యతగా ఉండుట చాలా ప్రాముఖ్యమని పౌలు ఫిలిప్పీయులకు చెప్పెను (ఫిలిప్పి 2:2).

సంఘములో సమాధానము కలిగి యుండుటకు, విశ్వాసులందరు కలిసి పనిచేయుటకు యేసు యొద్ద నుండి సహాయము లభించునని పౌలు బోధించాడు. ఈ అంశమును గురించి నూతన నిబంధనలో అనేకచోట్ల మనము చదువవచ్చును. ఎప్పుడు మనము కలిసి పనిచేయుట మానివేస్తాము? ఆ సమస్య పరలోకములో ఉన్న ఒక దేవదూత హృదయములో ప్రథమముగా ఆరంభమైనది. ఆ దేవదూత పేరు లూసిఫరు (యెషయా 14:12-14) దేవుని యొక్క ధర్మశాస్త్రమునకు మరియు ఆయన పరిపాలనకు వ్యతిరేకముగా లూసిఫరు దేవునితో యుద్ధము చేసినపుడు కొందరు దేవదూతలు లూసిఫరుతో చేరిపోయారు. అటు తరువాత ఏదెను వనములో ఆదామవ్వలు కూడా లూసిఫరుతో కలిసిపోయారు (ఆదికాండము 3:1-6).

మన క్రైస్తవ సంఘములో సంఘ సభ్యులందరు ఎందువలన కలిసి పనిచేయవలసి యున్నదని బైబిలు ఆ విషయములో ఏమి బోధించుచున్నదో ఈ వారము మనము అధ్యయనము చేయబోవుచున్నాము. ఇదే అంశమును గూర్చి యేసు యొద్ద నుండి మనము ఏ గుణపాఠమును నేర్చుకొనగలమో కూడా చదువుకొనబోవుచున్నాము.

– జనవరి 24, సబ్బాతు దినమున ఈ వారమునకు ఏర్పాటు చేయబడిన సబ్బాతుబడి పాఠమును అధ్యయనము చేయుటకు సిద్ధపడుడి.

**ఆదివారం** **జనవరి 18**

## ఫిలిప్పీలోని క్రైస్తవ సంఘములో వాదించుకొనిరి (ఫిలిప్పీ 2:1-3)

**ఫిలిప్పీలోని సంఘ సభ్యులు ఏకారణమునుబట్టి వాదించుకున్నారు. వారి మధ్య నున్న సమస్యను ఏది పరిష్కరిస్తుందని పౌలు వారికి చెప్పెను? (జవాబు కొరకు ఫిలిప్పీ 2:1-3)**

ఫిలిప్పీ క్రైస్తవ సంఘములో వచ్చిన సమస్యను గూర్చి పౌలు చాలా విచారించియుంటాడు. ఆ సంఘమును పౌలు చాలా ఎక్కువగా ప్రేమించెను. ఆయనే ఫిలిప్పీలో ఆ సంఘమును స్థాపించెను. అవును ఆ సంఘములో చెలరేగిన సమస్య అతని హృదయమును గాయపరచెను. రోములో ఉన్న సంఘ సభ్యుల వలె, ఫిలిప్పీ సంఘ సభ్యులు స్వార్ధముతో గాని, గర్వముతో గాని ఉండకూడదని పౌలు వారిని హెచ్చరించెను (ఫిలిప్పీ 1:16) ఈ సంఘములో ఉన్న నాయకులు ప్రాధాన్యతను సంపాదించుకునే ఉద్దేశముతో ఒకరి మీద మరొకరు పోటీ పడుచున్నారు. యేసు యొక్క పరిచర్యను బలముగా ముందుకు తీసుకొని వెళ్ళే పని యెడల వారు చాలా నిర్లక్ష్య భావమును చూపించిరి.

స్వార్ధముతోను మరియు గర్వమనే పాపముతోను నిండిన హృదయము ప్రమాదకరమైనదని పౌలు వారిని హెచ్చరించెను. (గలతీ 5:20) అటువంటి హృదయము గల వారిని యాకోబు కూడా ఈవిధముగా హెచ్చరించెను. "ఏలయనగా మత్సరమును వివాదమును ఎక్కడ ఉండునో అక్కడ అల్లరియు ప్రతి నీచకార్యమును ఉండును" (యాకోబు 3:16) గర్వముతో నిండియున్న ప్రజలు, వారు సంఘములో ఇతరుల కన్నా ఎక్కువ ప్రాముఖ్యమైన వారు అని భావిస్తారు. వాస్తవమునకు వారికి అటువంటి స్థితిలేదు. అందువలననే వేరొక పత్రికలో గలతీయులకు పౌలు ఈ రీతిగా వ్రాసెను. "ఒకరినొకరము వివాదమునకు రేపకయు, ఒకరియందొకరము అసూయపడకయు వృథాగా అతిశయపడకయు ఉందుము" (గలతీ 5:26).

ఈ సమస్యలను పరిష్కరించుటకు పౌలు ఆయన చేసే కొన్ని సూచలను అనుసరించి నడుచుకోమని చెప్పెను.

**1. యేసు యొక్క మాదిరి :** హృదయమునకు సంబంధించిన పాపమునకు వ్యతిరేకముగా యేసు యొక్క జీవితము ఏవిధముగా ఒక శక్తివంతమైన మాదిరిని చూపిస్తుందో గమనించి అనుసరించమని పౌలు చెప్పుచున్నాడు.

**2. ప్రేమ :** యేసు మనకు దేవుని యొక్క ప్రేమను ప్రత్యక్షపరచుచున్నాడు. యేసు మనకు ఈలాగు ఆజ్ఞాపించెను. "నేను మిమ్మును ప్రేమించిన ప్రకారము మీరొకని నొకడు ప్రేమించవలెనుటయే నా ఆజ్ఞ" (యోహాను 15:12).

**3. పరిశుద్ధాత్మతో సహవాసము :** సంఘ సభ్యులు వారి హృదయములలో ఒకరితో ఒకరు సన్నిహిత సంబంధములు కలిగియుండే విధముగా పరిశుద్ధాత్మ వారికి సహాయపడును. ఇటువంటి సన్నిహిత సహవాసమును ఆదిమ క్రైస్తవ సంఘము అనుభవించినది (అపొ.కా. 2:42ను 2కొరింథి 13:14తో పోల్చి చూడుడి).

**4. ఒక దయగల హృదయము :** యేసు తన జీవితములో ప్రేమను మరియు క్షమించే గుణమును ప్రదర్శించెను. (మత్తయి 9:36; మత్తయి 20:34; మార్కు 1:41 చదువుడి). మంచి సమరయుని వృత్తాంతము ద్వారా ప్రేమ మరియు క్షమాపణ గూర్చి యేసు బోధించెను (లూకా 10:33) తప్పిపోయిన కుమారుడు (లూకా 15:20).

**5. కనికరము :** యేసు కనికరమును చూపించెను. యేసును వెంబడించే వారి జీవితములలో కూడా కనికరమును చూపించాలి (లూకా 6:36).

**6. సమాధానము మరియు కలిసి పనిచేయుట :** పౌలు చెప్పినట్లు మనము 'యేసు ఆలోచించినట్లు, ప్రవర్తించునట్లు మనము కూడా చేయాలి' (ఫిలిప్పీ 2:5)

**సోమవారం** **జనవరి 19**

## క్రైస్తవ సంఘములో సమాధానము కొరకు కలిసి పనిచేయవలెను (ఫిలిప్పీ 2:3,4)

మన ప్రవర్తన చాలా ప్రాముఖ్యమైనదని మత నాయకులు బోధించారు. అయితే సరియైన ప్రవర్తన ఒక మనుష్యుని పవిత్రునిగా గాని, నిరపరాధియని గాని చేయలేమని యేసు చెప్పెను. చెడు విషయాలు హృదయములోను, మరియు మనస్సులోను ఆరంభమవుతాయి. ఈ విషయాన్ని మనము యేసు మరియు ధనవంతుడైన ఒక యౌవనస్తుని గూర్చిన వృత్తాంతములో ఈ బోధను చూస్తున్నాము. ధనికుడైన యౌవనస్తుడు తన జీవిత కాలమంతటిలో దేవుని ధర్మశాస్త్రమును గైకొనుచునే ఉన్నట్లు యేసుతో చెప్పెను. అందుచేత అతని హృదయములో ఏమి దాగియున్నదో బయలుపర్చుటకు యేసు అతనికి ఒక చిన్న పరీక్ష పెట్టెను. అతనికున్న ఆస్తినంతటిని అమ్మి ఆ డబ్బును పేదలకు పంచిపెట్టి ఆయనను వెంబడించమని చెప్పెను. యేసు ఇంకా మాట్లాడుతూ "దురాలోచనలు, నరహత్యలు, వ్యభిచారములు, వేశ్యాగమనములు, దొంగతనములు, అబద్ధసాక్ష్యములు, దేవదూషణలు హృదయములో నుండియే వచ్చును" (మత్తయి 15:19).

**క్రైస్తవ సంఘములో సమాధానము ఉండాలనుకున్నట్లయితే మనము ఏమి చేయవలెను? జవాబు కొరకు ఫిలిప్పీ 2:3, 4 చదువుడి.**

పౌలు యొక్క సలహా మేరకు మన హృదయములో ఉన్న గర్వమునంతటిని ఖాళీ చేసుకొనవలసియున్నది. ఇతరులకన్న ప్రాముఖ్యమైన వారమనే తలంపు మనకు ఉండకూడదు. మన సొంత అవసరాలను తీర్చుకొనుటయే కాకుండా, ఇతరుల అవసరాలను గూర్చి కూడా శ్రద్ధ వహించవలసియుంది. ఇతరుల అవసరాలను గూర్చి మనము ఆలోచించాలని చెప్పుట చాలా సులభమే గాని అమలు చేయుటలోనే మన చిత్తశుద్ధి కనిపిస్తుంది. ఈ ప్రాముఖ్యమైన నియమాలను పాటించినచో, ఇతరులతో మన బాంధవ్యాలు మెరుగుపడును. ఇతరులు చెప్పే విషయాలను వినే స్వభావము కూడా మనకుండాలి. ఇతరులతో మాట్లాడినప్పుడు అన్ని విషయాలను గూర్చి చాలా స్వేచ్ఛగా మాట్లాడుటకు ఇష్టపడుదుము. అయితే మాట్లాడుట ప్రారంభించకముందు ఎదుటి వారు ఏమి చెప్పాలని చూస్తున్నారో ఆ విషయాలను వారిని మనము చెప్పనివ్వాలి. వారు చెప్పినపుడు ముందుగా వినాలి. వారు చెప్పే విషయాలతో మనము అంగీకరించకపోవచ్చు. అయితే వారు చెప్పే విషయాన్ని వినాలి. మీరు చెప్పే విషయాన్ని వారు విని అర్థము చేసుకోవాలని మీరు అనుకోక, ఇతరులు చెప్పే విషయాలు విని అర్థము చేసుకోవాలి. అట్లా జరిగినపుడు ఆరోగ్యకరమైన సంభాషణ సంభవిస్తుంది. ఇరుపక్షాల మధ్య

నమ్మకము ఏర్పడుతుంది. సంఘములో మన మధ్యన సరియైన బాంధవ్యములు ఏర్పడుటకు దోహదపడుతుంది.

ఇతరులతో ఏవిధంగా సహకరించి నడుచుకోవాలో పరిశుద్ధాత్మ మనకు సహాయము చేయునని పౌలు మాట్లాడుచున్నాడు (ఎఫెసి 4:3). ఇతర విశ్వాసులతో కలిసి పనిచేయుటకు అంగీకరించినపుడు ఇరు వర్గాలను జత చేయుటకు దేవుని యొద్ద నుండి సమాధానము దొరుకును (ఎఫెసి 4:3) సంఘములో తోటి విశ్వాసులతో పోట్లాడితే, పరిశుద్ధాత్మ ఆ పోట్లాటను నివారించుటకు సహాయపడును. పరిశుద్ధాత్మ మన మధ్య సమాధానమును నెలకొల్పగలడు. యేసును గూర్చి విశ్వాసమును బోధించుట గూర్చి అంగీకరించవలసిందని పౌలు చెప్పాడు (ఎఫెసి 4:13) యేసును గూర్చి, ఆయన బోధలను గూర్చి తెలుసుకున్నపుడు, మనము కూడా బైబిలు సత్యము గూర్చి అవగాహన కలిగియుంటాము. అపుడు క్రైస్తవ సంఘము కూడా ఐక్యపర్చబడి యుంటుంది.

## మంగళవారం జనవరి 20

## మనస్సును స్వాధీనపరచుకొనుట (ఫిలిప్పీ 2:5)

అనేక పరిశ్రమలు నేడు మానవ మెదడుతో కంప్యూటర్లను అనుసంధానము చేయుటకు ప్రయత్నిస్తున్నారు. మన తలంపులను కంప్యూటర్ల సహాయంతో మార్చి వేయాలని శాస్త్రజ్ఞులు ఆశపడుచున్నారు. కొంతమంది శాస్త్రజ్ఞులు కంప్యూటర్లను ఉపయోగించి ప్రజలకు వచ్చే రోగాలకు చికిత్స చేసి సహాయపడాలని వాగ్దానము చేస్తున్నారు. అవును అదొక మంచి తలంపే కదా? అయితే మానవ మెదడును కంప్యూటర్ల సహాయముతో అదుపు చేయుటకు ఎటువంటి దుర్మార్గపు మార్గములను ఎంచుకుంటారో ఒకసారి ఊహించుకోండి.

అనేక సందర్భాలలో మనస్సులు కూడా ఒక కంప్యూటర్‌ను పోలి దానికన్నా మేలైన విధముగా పనిచేస్తాయి. ప్రతి దినము నూతన సమాచారము, నూతన జ్ఞానము మరియు నూతన భావములు మన మెదడులోనికి ప్రవేశిస్తాయి. ఈ సమాచారము మన తలంపులను, మన ప్రవర్తనను మార్చివేయగలదు. మనము ఎక్కువగా టి.వి. కార్యక్రమాలను తిలకించినపుడు ప్రజలు ఏవిధముగా ఆలోచిస్తున్నారు మరియు ఏవిధముగా నటిస్తున్నారో అనే విషయాలను చూడగలుగుచున్నాము. అటువంటి నటీనటులను చూచి, వారి వలెనే ఆలోచించి ప్రవర్తించుట ప్రారంభిస్తాము. ఒకవిధముగా చెప్పాలంటే వారి తలంపులు భావములు మన మెదడులో నాటి వేయబడినట్లు ప్రవర్తిస్తాము.

మన మనస్సులను స్వాధీనములో ఉంచుకొనుటకు పరిశుద్ధాత్మను అనుమతించాలని యేసు మనలను కోరుచున్నాడు. (రోమా 8:6). మనలను మనము పరిశుద్ధాత్మ వశములో ఉంచుకొనవచ్చు లేక మానవుల భావముల వశములో ఉండవలసి వస్తుంది (1కొరింథి 2:11,12) మనకు ఎవరు బోధిస్తారు? మనము ఏమి నేర్చుకుంటున్నాము?

**యేసుక్రీస్తువలె ఆలోచించి ఆయన వలె ప్రవర్తించుట అనగా అర్ధమేమి? (ఫిలిప్పీ 2:5).**

చివరికి ఏమి ఆలోచించాలో మనము తీర్మానించుకొనవచ్చును. అయితే మన హృదయములను మాత్రము మార్చుకొనలేము. కేవలం దేవుడు మాత్రమే మనలను మార్చగలడు. హృదయముల మీద శస్త్ర చికిత్స చేసే వైద్యుని వంటివాడు పరిశుద్ధాత్ముడు. మన హృదయము లోపల ఏమి ఉన్నదో చూచుకొనుటకు సహాయము చేయుటకు బైబిలు ఒక శక్తివంతమైన ఆయుధముగా పరిశుద్ధాత్మ ఉపయోగించును. "ఎందుకనగా దేవుని వాక్యము సజీవమై బలముగలదై రెండంచుల యెటువంటి ఖడ్గము కంటెను వాడిగా ఉండి, ప్రాణాత్మలను, కీళ్ళను విభజించునంత మట్టుకు దూరుచు, హృదయము యొక్క తలంపులను ఆలోచనలను శోధించుచున్నది" (హెబ్రీ 4:12). పరిశుద్ధాత్మ యొక్క సహాయము లేనియెడల నిజముగా ఎవరమై యున్నామో అనే విషయము మనకు తెలియదు. సొంత హృదయములు మనలను మోసము చేయును (యిర్మియా 17:9). అబద్ధములు లేక మోసములు గూర్చి వివరించే హీబ్రూ పదము "అక్వో". మనము తొట్రిల్లి పడి పోయే విధముగా చేసే ఎత్తు పల్లములుగా ఉన్న నేల అని దాని భావము. అనగా మన సొంత తలంపులను నమ్ముకొనలేము అని అర్థము చేసుకొనుటకు ఈ మాటను బైబిలు ఉపయోగిస్తుంది. మన హృదయాలను, మన మనస్సులను మార్చుటకు బైబిలు అవసరమైయున్నది. "మీరు ఈ లోక మర్యాదను అనుసరింపక ఉత్తమమును, అనుకూలమును, సంపూర్ణమునైయున్న దేవుని చిత్తమేదో పరీక్షించి తెలిసికొనునట్లు మీ మనస్సు మారి నూతన మగుట వలన రూపాంతరము పొందుడి" (రోమా 12:2).

**బుధవారం** **జనవరి 21**

## యేసు ఆలోచించినట్లుగానే ఆలోచించుట (ఫిలిప్పీ 2:5-8)

"మహమ్మద్ ఆలీ భూమి మీద నేనే గొప్ప ముష్టి యుద్ధ యోధుడను" అని డంబముగా రంకెలు వేస్తున్నాడు. 1963లో ప్రపంచ ముష్టి యుద్ధ పోటీలలో విజయము సాధించి ఒక శూరుడుగా పేరు తెచ్చుకున్నాడు. దాని తరువాత ఆరు నెలలకు "ఆలి" తాను ముష్టి యుద్ధ వీరుడుగా సాధించిన అనేక పోటీలలోని విశేషాలతో చిత్రములతో కూడిన పుస్తకమును తయారు చేసి దానికి "నేనే ఉత్తమమైనవాడను" అని పేరు పెట్టాడు. అవును నిజముగానే మహమ్మద్ ఆలి గొప్ప ముష్టి యుద్ధవీరుడే. అయితే అతడు క్రైస్తవులకు ఒక మాదిరికాదు. అతడిని వెంబడించుటకు యోగ్యుడు కాదు. యేసు ఆలోచించినట్లు వారు కూడా ఆలోచించినచో అతనిని వెంబడించుట సాధ్యము కాదు.

యేసు పరిపూర్ణుడు మరియు పాపరహితుడు. కొన్ని సమయాలలో మనము తప్పుచేయాలని కోరుకుంటామని యేసుకు తెలుసు. సాతానుడు యేసును కూడా అటువంటి తప్పులను చేయుటకు ప్రోత్సహించెను. అయితే యేసు ఎన్నడూ ఎటువంటి తప్పును చేయలేదు (హెబ్రీ 4:15) యేసు తన తలంపులలో కూడా పాపము చేయలేదు. అదే సమయములో యేసు శ్రమలను అనుభవించాడు. ఆయన పడిన శ్రమల ద్వారా దేవుడు చెప్పిన విషయాలను

చేయుటకు నేర్చుకొనెను (హెబ్రీ 5:8). యేసు తన తండ్రికి ఎల్లప్పుడు విధేయత చూపుట సాధ్యము కాని పరిస్థితులలో సహితము ఆయన దేవునికి తన విధేయతను చూపించెను.

**ఫిలిప్పీ 2:5-8 చదువుడి. ఈ శక్తివంతమైన మరియు ఎంతో భావముతో కూడిన వాక్యముల ద్వారా పౌలు మనకు ఏమి బోధించాడు? ఆయన చెప్పిన విషయాలు మనకు ఎటువంటి భావమును కలుగజేయుచున్నవి? బైబిలు సత్యమును మన జీవితాలలో ఏవిధముగా జీవించుచున్నాము?**

యేసు దేవుడైయున్నాడు. అయితే ఆయన ఒక మానవుడుగా ఈ లోకములో జన్మించెను. దానికన్నా ముఖ్యముగా యేసు ఒక దాసునిగా మారెను. (ఫిలిప్పీ 2:5-8)లో 'సర్వెంట్' అనే మాట డేలోస్ అనే పదము నుండి వచ్చినది. "డేలోస్" అనే పదానికి ఆంగ్లేయ భాషలో ఒక "స్లేవ్" అనే పదము వాడబడినది. యేసు ఒక మానవుడుగాను, దాసునిగాను అవతరించినప్పుడు మన పాపములనిమిత్తము తనను తాను ఒక బలియాగముగా అర్పించుకొనెను. మరొక పత్రికలో పౌలు ఈవిధముగా వ్రాసెను. "ఆత్మను గూర్చిన వాగ్దానము విశ్వాసము వలన మనకు లభించునట్లు'" (గలతి 3:13) మనలను సృష్టించిన దేవుడు కూడా మన కొరకు సిలువ మీద మరణించెను. ఆయన కూడా మన రక్షకుడే. మనలను రక్షించు నిమిత్తము యేసు మన కోసము శాపమాయెను.

పౌలు చెప్పుచున్న ఈ విషయాలను మనము ఏవిధముగా నెరవేర్చగలము? మన హృదయములలో ఉన్న గర్వమును తీసివేసుకొని ఏవిధముగా మనము యేసును వెంబడించగలము?

యేసు కూడా ఈవిధముగా చెప్పెను "మీలో అందరికంటే గొప్పవాడు మీకు పరిచారకుడై యుండవలెను. తన్ను తాను హెచ్చించుకొనువాడు తగ్గింపబడును. తన్ను తాను తగ్గించుకొనువాడు హెచ్చింపబడును" (మత్తయి 23:11,12) ఫిలిప్పీ 2:58లో ఉన్న పౌలు యొక్క మాటలను బాగుగా అర్ధము చేసుకొనుటకు మత్తయి 23:11,12లోని యేసు యొక్క మాటలు మనకు సహాయపడును.

## గురువారం జనవరి 22

## మన ఆరాధన జీవితము యొక్క రహస్యము (రోమా 8:3)

**యేసు మానవుడుగా అవతరించినపుడు ఆయన వదులుకున్నదేమిటి? జవాబు కొరకు రోమా 8:3; హెబ్రీ 2:14-18; హెబ్రి 4:15 చదువుడి.**

దేవుని కుమారుడైన యేసు పరిశుద్ధాత్మ సహాయముతో ఒక మానవ చంటి బిడ్డగా జన్మించెను. అది ఎట్లు సంభవించినది? శాశ్వత జీవముగల ఒకరు మరణించే ఒకనిగా జన్మించుట ఏమిటి? పౌలు వ్రాసిన విషయాలలో ఈ మర్మమును గూర్చిన భాగము కూడా ఉన్నది. "నిరాక్షేపముగా దైవభక్తిని గూర్చిన మర్మము గొప్పదైయున్నది" (1తిమోతి 3:16).

యేసు మనలో ఒకనిగా రావడానికి ఉన్న అనేక విషయాలను గూర్చి పౌలు ఫిలిప్పీ 2లో వ్రాస్తున్నాడు.

1. ఆయన (యేసు) అన్ని విషయాలలో దేవుని స్వరూపము కలిగినవాడై యుండెను. (ఫిలిప్పీ 2:6) అన్ని విషయములలో దేవుని స్వరూపము కలిగినవాడైయుండెను. ఫిలిప్పీ 2:6 అనే ఈ మాటలు గ్రీకు పదమైన "మోర్‌ఫె" నుండి వచ్చినవి. "మోర్‌ఫె" అనే పదము యేసు దేవుడు అని మనకు చూపించుచున్నది. (యోహాను 1:1తో పోల్చి చూడుడి).

2. పరలోకమును విడిచి పెట్టి వచ్చుటకు ఆయన ఎన్నుకొనెను (ఫిలిప్పీ 2:7). వేరొక బైబిలు ప్రకారము "యేసు తనను తాను రిక్తునిగా చేసుకొనెను" (ఫిలిప్పీ 2:7) ఒక దాసుని స్వరూపము తీసుకొనెను (ఫిలిప్పీ 2:7) దేవుడుగా యేసుకున్న ఘనత మరియు ప్రభావములు వదులుకొని, నిజమైన మానవుడుగా ఈ లోకములో పుట్టెను. సాతాను మనలను పాపము చేయుటకు ప్రోత్సహించుటకు ప్రయత్నించినపుడు మన భావములు ఏవిధముగా ఉంటాయో యేసు అర్ధము చేసుకుంటాడు.

3. ఆయన తనను తాను తగ్గించుకొనెను (తన హృదయములో గర్వము లేకుండా చూచుకొనెను) (ఫిలిప్పీ 2:8) యేసు మానవుడుగా జన్మించిన తరువాత తనను తాను దాసునిగా చేసుకొనెను లేక తగ్గించుకొనెను. యేసును లూసిఫర్‌తో పోల్చి చూడుడి. యేసు సేవ చేయుటకు వచ్చెను. అయితే లూసిఫరు సమస్తము తన స్వాధీనములో ఉంచుకోవాలనే ఉద్దేశము కలిగినవాడు.

4. ఆయన చివరికి సిలువ మీద మరణించుటకు సహితము సమ్మతించెను. (ఫిలిప్పీ 2:8) యేసు ఈ లోకములో జీవించిన కాలములో ఘోరమైన మరణము పొందడమంటే అది సిలువ మీద మరణించడమవుతుంది. ఇటువంటి మరణమును యేసు తనకు నిర్ణయించుకున్నాడు. తండ్రియైన దేవుడు మరియు యేసు కలిసి యేసు సిలువ మీద మరణించవలెనని నిర్ణయించుకొనిరి. తండ్రియైన దేవుడు కుమారుడైన క్రీస్తు సమాధానముతో ఆ నిర్ణయమును కలిసి చేసిరి (జెకర్యా 6:13) "యేసు సిలువ మీద మరణించుటకు అనేక వందల సంవత్సరాలకు పూర్వమే ఇశ్రాయేలీయులకు వారి ప్రణాళికను దేవుడు యేసు కలిసి చూపించిరి. ఒక స్తంభము మీద పెట్టబడిన సర్పము యేసును సూచించే చిహ్నముగా పరిగణించబడెను. ఈ సర్పమును మోషే ఇత్తడితో తయారుచేసి స్తంభము యొక్క చివరన, భూమికి ఎత్తైన భాగము పై ఆ సర్పమును ఉంచెను" ఈ సర్పము యేసు ఈ లోకమునకు వచ్చి ఏ పని చేయనైయున్నాడో అనగా రక్షణార్ధమైన పనిని చేయుటకు వచ్చిన విషయాన్ని సూచించుచున్నది. (సంఖ్యా 21:9; యోహాను 3:14) అదే విషయాన్ని పౌలు ఈవిధంగా వివరించాడు. "ఎందుకనగా మనమాయన యందు దేవుని నీతి అగునట్లు పాపమెరుగని ఆయనను మన కోసము పాపముగా చేసెను" (2కొరింథి 5:21).

శుక్రవారం జనవరి 23

## అదనపు అధ్యయనము

"మనము యేసు యొక్క విద్యార్థులముగా మారాలి. మన రక్షకుని యొద్ద ఏమి నేర్చుకోవాలి? మన హృదయములను గర్వముతో నింపుకొనుడని ఆయన మనకు బోధిస్తాడా? మనము ఇతరులకన్నా మంచివారము మరియు ఆశ్చర్యకరమైన మనుష్యులము అని ఆయన మనకు బోధిస్తాడా? అయితే ఆయన ఆవిధముగా బోధించడు. యేసు మనకు ఎంత ఎక్కువగా బోధిస్తే, అంత ఎక్కువగా మన హృదయములను గర్వము లేకుండా ఖాళీ చేసుకుంటాము. తెలుసుకోవలసిన అన్ని విషయాలను క్షుణ్ణముగా తెలుసుకున్నాము అని మనము ఎన్నడూ అనుకొనకూడదు. దేవుడు మనకు ప్రావీణ్యతను మరియు తలాంతులను అనుగ్రహించును. ఆయనకు ఏవిధముగా వినియోగించగలము? శాశ్వతముగా జీవించగలిగే దేహములను దేవుడు మనకు అనుగ్రహించబోవుచుండగా ఈ జీవితములో నేర్చుకున్న విషయాలను మరచిపోలేము. నేర్చుకున్న ఈ జ్ఞానమును మన వెంట పరలోకమునకు తీసుకొని వెళ్లెదము. అక్కడ మనము యేసుతో కూడా శాశ్వత కాలము జీవించనైయున్నాము. యేసు మన రక్షకుడుగా ఆయనను గూర్చి మనము అధ్యయనము చేయబోవుచున్నాము. ఆయన చేసిన పని విషయము కూడా శాశ్వతకాలము చదువుకొనబోవుచున్నాము" -ఎలెన్ జి వైట్, చేతివ్రాతలు 36, 1885.

## చర్చించుకొనుటకు ప్రశ్నలు

1. దేవుని ప్రేమను గూర్చి నీవేమి నేర్చుకొంటివి? దేవుని ప్రేమ నిజమైనది అని మనకు చూపించిన అనుభవములేమైన ఉన్నవా? మీ తరగతి గదిలో దేవుని ప్రేమను గురించి అనేక మార్గముల ద్వారా నీవు నేర్చుకున్న విషయములేమిటి?
2. యేసు దేవునితో తనకున్న హోదాను, దైవత్వమును విడిచి రిక్తునిగా ఈ లోకమునకు వచ్చెను. అనగా దాని అర్థము ఏమిటి? ఆయన దాసుని రూపమును ధరించుకొనెను అనగా అర్ధమేమిటి? (ఫిలిప్పీ 2:7; రోమా 8:3తో పోల్చి చదువుడి) ఫిలిప్పీ 2:7తో రోమా 8:3 జత చేసి చదువుడి. ఈ రెండు వచనములు ఒకే భావమును ఏవిధముగా కలిగియున్నవి? ఈ రెండు వాక్యములు మనకు యేసును గూర్చి ఏమి బోధించుచున్నవి?
3. ఈ వారం క్రైస్తవ సంఘములో అందరము కలిసి సమాధానముతో పనిచేయవలెననెడి అవసరమును గూర్చి చదువుకొంటిమి. సమాధానము కొరకు అందరూ కలిసి పని చేయలేకపోవుటకు మీసంఘములో ఉన్న సమస్య ఏమిటి? మనము ఏదైనా సమస్యను ఎదుర్కొనినపుడు మనకు పౌలు ఇచ్చిన సలహా ఈవిధముగా ఉన్నది? "కక్షచేతనైనను, వృధాతిశయము చేతనైనను, ఏమియు చేయక వినయమైన మనస్సుగలవారై యొకనినొకడు తనకంటె యోగ్యుడని ఎంచుడి" (ఫిలిప్పీ 2:3) ఒక క్రైస్తవ సంఘముగా ఉన్న మనకు ఈ సలహా మన సమస్యను పరిష్కరించుకొనుటకు ఏవిధముగా మనకు సహాయపడును?

❋✶❋